బ్రహ్మాండం.. బ్రహ్మేశ్వరుని రథోత్సవం

- భక్తులతో కిక్కిరిసిన బ్రహ్మగుండం క్షేత్రం
- నేడు గ్రామోత్సవం, బండలాగుడు పోటీలు

వెల్దుర్తి (కృష్ణగిరి): హరహర మహాదేవ నామస్మరణ బ్రహ్మగుండం క్షేత్రంలో మార్మోగింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గంగా, గౌరీ సమేత బ్రహ్మేశ్వర స్వామి రథోత్సవం బ్రహ్మాండంగా సాగింది. ధర్మకర్తల మండలి చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ టి.హనుమంతరావ్, ఈఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో రమణీయంగా సాగిన రథోత్సవాన్ని జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు కనులారా తిలకించి పులకించారు. ముందుగా సర్వాలంకారభూషితులైన స్వామి, అమ్మవార్ల దేవతామూర్తులను ఆయకట్టుదారులు, అర్చకులు మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణం నుంచి రథశాలకు చేర్చారు. సర్వాంగసుందరంగా అలంకరించిన రథంపై ఆసీనులుగావించారు. అనంతరం రథాంగపూజ, క్రతువులు నిర్వహించారు. ఆచారులు కొబ్బరి, గుమ్మడి కాయలను సాత్వికబలిగా సమర్పించారు. శాస్త్రోక్త పూజలనంతరం హరహర మహాదేవ నామస్మరణ మధ్య భక్తులు


బ్రహ్మగుండంలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రథం గొలుసులను లాగి ముందుకు కదిలించారు. దాదాపు 200 మీటర్ల దూరం రథాన్ని లాగి తిరిగి రథశాలకు చేర్చారు. అనంతరం ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్ద నుంచి ఆలయానికి చేర్చారు. రథయాత్ర ముందు నిర్వహించిన నంది కోలు సేవ భక్తులను అలరించింది. భక్తుల ఆధ్యాత్మికతకు తోడు చిన్నారుల బొమ్మల కొనుగోళ్లు, ఆడపడుచులకు గాజులు, పూజా సామగ్రి కొనుగోళ్లు, తిరుణాల స్పెషల్ చెరుకుగడలు, స్వీట్లు కొనుగోళ్లు చేస్తూ, జెయింట్ వీల్, డాన్సింగ్ డాల్‌లో ఆహ్లాదంగా గడిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, దశరథరామిరెడ్డి, జెడ్పీటీసీ దాదిపోగు సుంకన్న, వెంకట్‌నాయుడు, శివారెడ్డి, ఆరిఫ్, దేవరాజ్, బాలాజీ, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు. వెల్దుర్తి ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా భక్తులను తరలించేందుకు మండల కేంద్రం నుంచి క్షేత్రానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, చెరుకులపాడు మల్లయ్య, ఎల్లప్పల జ్ఞాపకార్థం వారి కుమారులు రాముడు, లోకేశ్, బెస్త సంఘం ఇలా పలువురు ఉచిత బస్సులు, రామళ్లకోట ఈర్ల శ్రీనివాసులు రామళ్లకోట నుంచి బ్రహ్మగుండానికి 25 ఆటోలు ఉచితంగా ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య అన్నసత్రం, కోటయ్య దేవాలయం నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.


రథంపై గంగా గౌరీ సమేత బ్రహ్మేశ్వర స్వామి

నేడు వసంతోత్సవం, బండలాగుడు పోటీలు

సోమవారం స్వామి, అమ్మవార్ల దేవతామూర్తులకు ఆలయ ప్రాకారం చుట్టూ వసంతోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సీనియర్ కేటగిరీ వృషభాలకు బండలాగుడు పోటీలు జరగనున్నాయి. సాయంత్రం దేవతామూర్తులకు వెల్దుర్తి పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహణతో ఉత్సవాలు ముగియనున్నాయి.

క్లుప్తంగా

గ్రామాల్లో పోలీస్ కవాతు


దేవనకొండలో పోలీసు బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ

దేవనకొండ: జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు రాబోయే జనరల్ ఎలక్షన్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ శ్రీనివాసులు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం దేవనకొండ, కుంకనూరు, వెలమకూరు, పి.కోటకొండ, కప్పట్రాళ్ల గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. సెంట్రల్ ఫోర్స్ బలగాలతో కవాతు నిర్వహించినట్లు సీఐ చెప్పారు. ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంతోత్సవం


ఉత్సవమూర్తులకు పల్లకోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మద్దికెర: బుగ్గ సంగమేశ్వరంలో గత మూడు రోజులుగా జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం జరిగిన వసంతోత్సవంతో కార్యక్రమంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు వసంతోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రదక్షిణ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన మస్తాన్ వలి ఉరుసు


స్వామి వారి ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలో వెలసిన దివానే మస్తాన్ వలి స్వామి ఉరుసు గ్రామ ప్రజలు పెద్దల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రతిమను గుర్రంపై గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. చివరి రోజైన ఆదివారం గ్రామంలోని భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామి వారికి చక్కెర చదివింపులు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉరుసు నిర్వహణకు మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు కమలమ్మ రూ.10 వేలు విరాళం అందించారు. ఆమెకు దర్గా నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

బల్లోటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న బల్లోటేశ్వర స్వామి

హాలహర్వి: మండలంలోని హాలహర్వి, బల్లోట, అమృతాపురం తదితర గ్రామాల్లో వెలిసిన బల్లోటేశ్వర, మారెమ్మవ్వ, ఆంజనేయ స్వామి, ఈశ్వర, సుంకలమ్మ ఆలయాల్లో ఆదివారం అమావాస్య కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లకు జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నాగరకణ్వీ రోడ్డుకు మరమ్మతులు


గ్రావెల్ వేసి చదును చేస్తున్న దృశ్యం

హొళగుంద: కర్ణాటక సరిహద్దులో వేదావతి (హగరి) నదికి ఆనుకుని అధ్వాన్నంగా ఉన్న నాగరకణ్వీ, హొన్నూరు రోడ్డు ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి, నాయకుల చొరవతో బాగైంది. గత కొద్ది రోజులుగా జరుగుతున్న తాత్కాలిక మరమ్మతు పనులు ఆదివారం పూర్తికావడంతో రాకపోకలు సులభతరంగా మారాయి. అధ్వానంగా మారిన నాగరకణ్వీ రోడ్డు సమస్య, ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి ఆ గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సమన్వయకర్త విరూపాక్షి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనల మేరకు.. ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ సహకారంతో మండల పరిషత్ నిధులతో ఈ పనులు చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా తెలిపారు. ఈ రోడ్డులో పొక్‌లెన్లు, లారీలు పెట్టి గుంతలను గ్రావెల్‌తో పూడ్చి చదును చేశారు. ఇప్పటికే మార్లమడికి క్రాస్ నుంచి నాగరకణ్వీ, హొన్నూరు వరకు 5.10 కి.మీలకు రూ.2.65 కోట్లు నిధులు మంజూరయ్యాయని, అయితే కొన్ని కారణాల వల్ల పనులు నిలిచిపోయినట్లు తెలిపారు. ప్రస్తుతం విరూపాక్షి, నాయకుల చొరవతో రోడ్డు సమస్య తీరినట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి, బసవనగౌడ్, మోహన్‌రాజ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంను విమర్శించే స్థాయి జయరాంకు లేదు

దేవనకొండ: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు లేదని జిల్లా జేసీఎస్ కన్వీనర్, ఆలూరు నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ తెర్నెకల్ సురేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మండలంలోని తెర్నెకల్ గ్రామంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా పదవులు ఇచ్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనని చెప్పారు. బీసీ సామాజికవర్గానికి చెందిన గుమ్మనూరు జయరాంకు రెండు సార్లు మంత్రి పదవి ఇచ్చారని, ఆ విశ్వాసం కూడా ఆయనకు లేదన్నారు. గతంలో టీడీపీని ఇష్టం వచ్చిన రీతిలో తిట్టి అదే తీర్థం పుచ్చుకోవడానికి ఆయన మనసు ఎలా వచ్చిందో ఆ దేవుడికే తెలియాలన్నారు. ఆలూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం జగనన్నకు బహుమతిగా ఇస్తామని చెప్పారు. తెర్నెకల్ సర్పంచ్ అరుణ్‌కుమార్, కొత్తకాపు మధుసూదన్‌రెడ్డి, వీరన్న, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా జేసీఎస్ కన్వీనర్ తెర్నెకల్ సురేందర్‌రెడ్డి

ఆలయాల్లో అమావాస్య పూజలు


దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

హొళగుంద: మండలంలో ఆదివారం అమావాస్యను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా ఆలయాలు, దర్గాల్లో ప్రత్యేక పూజలు, ఫాతెహాలు నిర్వహించారు. దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు, మహామంగళారతి, అర్చనతో పాటు ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామపెద్దల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. అదేవిధంగా హొళగుంద సిద్ధేశ్వర స్వామి, సాయిబాబా మందిరం భక్తులతో కిటకిటలాడాయి. కర్ణాటక రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అలాగే ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలు, హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేశారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామ సమీపంలో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. మొత్తం 10 జతల వృషభాలు పాల్గొన్నాయి. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు, చంద్రశేఖర్ ప్రారంభించారు. హోరాహోరీగా జరిగిన బండలాగుడు పోటీల్లో విజేతగా కోడుమూరు మండలం వెంకటగిరి వృషభాలు గెలుపొందాయి. వాటి యజమాని రైతు బీఎల్‌కేకు రూ.50 వేలు నగదును ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు అందజేశారు. తర్వాతి స్థానాల్లో నిలిచిన పామిడికి చెందిన కర్ణం కృష్ణ, పులికొండకు చెందిన మాధవరాజుకు రూ.40 వేలు, పులికొండకు చెందిన రంగస్వామికి రూ.30 వేలు, యనకండ్ల వేణుగోపాల్‌నాయుడుకు రూ.20 వేలు, బళ్లారికి చెందిన రమేష్ బాబు, పుచ్చకాయలమాడకు చెందిన ధనుంజయకు రూ.10 వేలను ఆలయ నిర్వాహకులు అందజేశారు. పోటీలను చూసేందుకు పెద్దసంఖ్యలో రైతులు తరలివచ్చారు.


బిణిగేరిలో వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉరకలేసిన వృషభాలు

తుగ్గలి: జోడెడ్ల గిరక బండి ముందుకు సాగుతుంటే రైతన్నల్లో ఉత్సాహం ఉరకలేసింది. మహా శివరాత్రి పండుగ సందర్భంగా మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో నిర్వహించిన ఎడ్ల గిరక బండి పోటీలు ఆదివారం ఉత్సాహభరితంగా సాగాయి. పోటీలను నిర్వాహకులు హెచ్.గోపాల్‌రెడ్డి, బహుమతి దాతలు వీరారెడ్డి, సుభాన్‌వలి, రంజాన్, కావలి వెంకట్రాముడు ప్రారంభించారు. ఈ పోటీల్లో మేకల కృష్ణమూర్తి వృషభాలు విజేతగా నిలవగా తర్వాతి స్థానాల్లో ఉప్పర పుల్లయ్య, వృషభాలు, దుబ్బ అక్బర్ వలీ వృషభాలు, దండు బడేసాహేబ్ వృషభాలు నిలిచాయి. విజేతలకు వరుసగా బహుమతి దాతలు వీరారెడ్డి రూ.5,116, సుభాన్‌వలి రూ.3,116, రంజాన్ రూ.1,000 అందించారు.


చెన్నంపల్లిలో గిరకబండి లాగుతున్న వృషభాలు

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు


నిట్రవట్టిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

హాలహర్వి: వైఎస్సార్‌సీపీ పాలనలో మండలంలోని ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని ఎంపీటీసీ గోపాల్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం నిట్రవట్టి గ్రామంలో వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో ప్రకటించిన 99 శాతం హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని, అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు రామంజిని, పరశురాం, రామలింగ పాల్గొన్నారు.

ఇమాంఖాశీం స్వామి ఉరుసు ప్రారంభం

కృష్ణగిరి: కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువు, కొలిచే వారికి కొంగు బంగారమై, ఆపదలో ఆదుకునే మహిమాన్వితుడు పోతుగల్లు గ్రామంలో వెలసిన ఇమాంఖాసీం స్వామి ఉరుసు ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం రాత్రి 11 గంటలకు మంగళవాయిద్యాలు, డప్పు దరువుల మధ్య అశ్వంపై స్వామికి గంధం సమర్పించారు. సోమవారం ఉరుసు కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు స్వామి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. ఇదే రోజు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. గెలుపొందిన వారికి దాతల సహకారంతో వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందించనున్నారు. 12న కిస్తీతో ఉరుసు ముగుస్తుంది. ఈ మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.


పోతుగల్లులోని ఇమాంఖాశీం స్వామి దర్గా

చిన్నారికి తప్పిన ప్రమాదం

- జెయింట్ వీల్ నుంచి పట్టుతప్పి వేలాడిన చిన్నారి

వెల్దుర్తి(కృష్ణగిరి): మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా వెల్దుర్తి పట్టణ సమీపంలోని బ్రహ్మగుండంలో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్ క్యాబిన్ నుంచి పట్టు తప్పిన చిన్నారి భువి (4వ తరగతి) చేతికందిన రాడ్డును పట్టుకుని వేలాడుతూ చివరకు ఇతరులు పైకి లాక్కోవడంతో ప్రమాదం నుంచి బయటపడింది. వివరాలు.. కర్నూలులో నివాసం ఉంటున్న మాధవి (వెల్దుర్తికి చెందిన మహిళ), శ్రీకాంత్ బంధువర్గంతో కలిసి ఆదివారం బ్రహ్మగుండంలో రథోత్సవానికి హాజరయ్యారు. తర్వాత తల్లి, తండ్రి, చిన్నారి, బంధువర్గంలోని యువకులు జెయింట్ వీల్‌లోని మూడు క్యాబిన్‌లలో ఎక్కి కూర్చున్నారు. వీల్ తిరగడం ప్రారంభమయ్యాక క్యాబిన్‌లోని చిన్నారి భువి పట్టు తప్పి పడిపోతూ చేతికందిన రాడ్డు పట్టుకుని వేలాడింది. అక్కడున్న ప్రజల హాహాకారాలతో అప్రమత్తమైన నిర్వాహకులు వీల్ రన్నింగ్‌ను ఆపారు. ఆ సమయంలో చిన్నారి 30 అడుగుల ఎత్తులో వేలాడుతోంది. అదే క్యాబిన్‌లో ఉన్న వారు చిన్నారిని పైనుంచి పట్టుకోగా కింది క్యాబిన్‌లో ఉన్నవారు పట్టుకుని సపోర్టు ఇచ్చారు. నిర్వాహకులు జెయింట్ వీల్‌ను ఎక్కే ప్రయత్నంలో ఉండగా క్యాబిన్‌లోని వారు చిన్నారిని పైకి లాక్కున్నారు. తర్వాత సురక్షితంగా కిందకు దిగారు. ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కస్తూర్బా ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నందవరం/మద్దికెర: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో 2024–25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూపులో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శైలజ ఆదివారం తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ (ఎంపీసీ)–40 సీట్లు, అలాగే 7వ తరగతి –1, 9వ తరగతి –2 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. అర్హులైన బాలికలు ఈ నెల 12 నుంచి ఏప్రిల్ 11వ తేదీలోగా http://apkgbv.apcfss.in/వైబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

- అలాగే మద్దికెర కస్తూర్బా విద్యాలయంలో 6వ తరగతి,ఇంటర్ ప్రవేశాలకు అర్హులైన బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జ్యోతి సూచించారు.

ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కో–ఆర్డినేటర్, ఆలూరు అబ్జర్వర్ తెర్నెకల్ సురేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగనన్న విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేశారన్నారు. మండలంలో అతి పెద్ద గ్రామమైన తెర్నెకల్‌లో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సర్పంచ్ అరుణ్‌కుమార్, ఎంపీటీసీలు, కార్యకర్తలు వెంట ఉన్నారు.

ఎండ వేడిమితో జాగ్రత్త

హాలహర్వి: వేసవితాపం ఎక్కువైన కొద్దీ ఆరోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి తిమ్మన్న అన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఎండవేడితో వడదెబ్బ, కండరాల నొప్పి, అలసట వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయన్నారు. వడదెబ్బ విషయంలో వీలైనంత త్వరగా వైద్య సాయం తీసుకోకపోతే ప్రాణాపాయం ఏర్పడుతుందన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలన్నారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.

నేడు కార్యకర్తల సమావేశం

ఆలూరు: స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలోని ఇబ్రహీం ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం సోమవారం ఉదయం 10 గంటల నుంచి 3:20 గంటల వరకు జరుగుతుందని ఆలూరు మండల కన్వీనర్ ఈరన్న, కో–కన్వీనర్ వీరేష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ సురేందర్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి, జిల్లా కోశాధికారి కొత్తకాపు మధుసూదన్ రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

నేడు వలంటీర్లకు సమావేశం

హొళగుంద: ఆలూరు పట్టణంలోని ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగే సమావేశానికి మండలంలోని 249 మంది వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు తప్పక హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా ఓ ప్రకటనలో కోరారు.

సిద్ధం సభతో శ్రేణుల్లో జోష్


మద్దికెర: సీఎం వైఎస్ ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న ప్రజలు

మద్దికెర: బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభను ప్రత్యక్షంగా వీక్షించేందుకు మద్దికెర ప్రధాన బజారులోని వైఎస్సార్ విగ్రహం వద్ద పెద్ద డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. పెద్దసంఖ్యలో అభిమానులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, మల్లికార్జున, శ్రీనివాసులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కోలేక టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పొత్తుల కోసం పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజాభిమానం కలిగిన పార్టీ వైఎస్సార్‌సీపీకే విజయం వరిస్తుందన్నారు. మండల కన్వీనర్ గంపల వెంకటేశులు, ఎంపీటీసీలు ఆంజనేయులు, రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


పత్తికొండలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్

పత్తికొండ రూరల్: బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన 'సిద్ధం' సభను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. పత్తికొండలోని నాలుగు స్తంభాల కూడలిలో వైఎస్సార్‌సీపీ నాయకులు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో సభాస్థలికి చేరుకున్నప్పటి నుంచి ప్రసంగం చివరి వరకు పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. బైక్‌లపై వెళ్లే వారు అక్కడే నిలబడి సిద్ధం సభను వీక్షించారు.

అభయాంజనేయుడికి పూజలు


పూజలందుకుంటున్న అభయాంజనేయ స్వామి

పత్తికొండ రూరల్: పత్తికొండ–కర్నూలు రోడ్డులో కొలువైన అభయాంజనేయ స్వామి ఆదివారం వైభవంగా అమావాస్య పూజలందుకున్నారు. అర్చకుడు రవి స్వామివారికి శాస్త్రోక్తంగా జలాభిషేకం, సహస్ర నామార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. మధ్యాహ్నం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ పక్కీరప్ప భక్తులకు అన్నదానం చేశారు.

నేడు 'చేయూత' చెక్కుల పంపిణీ

నందవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 'వైఎస్సార్ చేయూత' 4వ విడుత మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, వైకేపీ ఏపీఎం చిన్న వీరన్న తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి హాజరవుతారని వెల్లడించారు. మండల అధికారులు, వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు, సిబ్బంది, గ్రామ వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎమ్మిగనూరుటౌన్: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక భరోసా ఇచ్చారు. పట్టణంలోని 9వ వార్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో గుడిసె కాలిపోయి తీవ్రంగా నష్టపోయిన బాధితురాలు మాలిన్‌బీకి ఆదివారం వార్డు కౌన్సిలర్ రాజారత్నం, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్‌తో కలిసి ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు బుట్టా నీలకంఠ, ప్రత్యూల్, సుధాకర్, ఖాశీంబేగ్, రజాక్ మాబాషా, తదితరులు ఉన్నారు.

చర్చిలో ప్రార్థనలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎంబీ చర్చిలో ఆదివారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక, భర్త నీలకంఠ, కుమారుడు ప్రత్యూల్ పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న బుట్టా రేణుక

అనంతరం ఆమె మాట్లాడుతూ.. మైనారిటీలు, క్రిష్టియన్ల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, ఆయనకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఆమెను పాస్టర్లు దీవించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరాజు, సునీల్‌కుమార్, పాస్టర్లు జయన్న, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం


హొన్నూరు కొట్టాలలో పైప్‌లైన్ పనులు చేస్తున్న దృశ్యం

హొళగుంద: మండల పరిధిలోని హొన్నూరు కొట్టాల గ్రామంలో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ, ఎంపీటీసీల సహకారంతో పైప్‌లైన్ ఏర్పాటు చేసి గ్రామస్తుల తాగునీటి సమస్యను తీర్చినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, పల్లి ఈరన్న, ఎంపీటీసీలు శివన్న, కెంచప్ప, మల్లికార్జున తదితరులు ఆదివారం తెలిపారు. ఇంతకుముందు బోరుబావి నుంచి గ్రామానికి ఏర్పాటుచేసిన పైప్‌లైన్ దెబ్బతినడంతో తాగునీటి సరఫరా లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యను గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లి ఈరన్న ఎంపీపీ, ఎంపీటీసీల దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించి ఎంపీపీ నిధులు రూ.3 లక్షలతో కొత్త పైప్‌లైన్ ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

వెల్దుర్తి(కృష్ణగిరి): పట్టణ సమీపంలోని అంబేడ్కర్ ఎస్సీ గురుకులం కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. చీఫ్/ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసూన, డీఓ ప్రసాద్, అబ్జర్వర్ దామోదర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఉదయం నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 899 మందికిగాను 62 మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్ ప్రవేశ పరీక్షకు 567 మందికిగాను 39 మంది గైర్హాజరయ్యారన్నారు. పరీక్షల నిర్వహణను ఫ్లయింగ్ స్క్వాడ్ పరిశీలించారు. విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారి తల్లితండ్రులు బయట ఎండలో వేచి చూస్తూ గడిపారు.

కృష్ణగిరి: కంబాలపాడు గురుకుల బాలికల పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 901 మందికిగాను 828 మంది, ఇంటర్ ప్రవేశ పరీక్షకు 532 మందికిగాను 496 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. పరీక్ష అనంతరం పత్రాలను ఏపీఆర్ సొసైటీకి పంపినట్లు ఆమె వెల్లడించారు.

ఆలూరు: అరికెర బాలయోగి గురుకులంలో 6వ తరగతి ప్రవేశపరీక్షకు 820 మందికిగాను 699 మంది హాజరయ్యారు. 129 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షకు 522 మందికిగాను 445 మంది హాజరుకాగా 77 మంది గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ టి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.


వెల్దుర్తి అంబేడ్కర్ గురుకులం కేంద్రంలో ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

నందవరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పనిచేయాలని మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, గ్రామ సర్పంచ్ తోట సావిత్రి పిలుపునిచ్చారు. ఆదివారం నందవరంలో 'మేము సిద్ధం..మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరిక నిర్మూలన కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ప్రతి గడప వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన మేలును వివరిద్దామన్నారు. గతంలో చంద్రబాబు పాలన, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలనలో తేడాను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు విరూపాక్షి రెడ్డి, మండల కన్వీనర్ చాంద్‌బాషా, బూత్ కన్వీనర్లు, గృహ సారథులు చాంద్‌తాత, పంపన్నగౌడ్, రమేశప్పగౌడ్, భీమన్న గౌడ్, పంపన్న, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.


నందవరంలో సిద్ధం పోస్టర్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు